ప్రజాశక్తి

శుక్రవారం 3 జనవరి 2025 | 5 | విజయనగరం

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు పునరుద్ధరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు రిజర్వాయర్‌గా పేరును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరును పునరుద్ధరించాలని ఎస్.కోట ఎంఎల్ఎ కోళ్ల లలితకుమారి జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి కొండపల్లి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేసిన కృషి ఫలితంగా పేరు పునరుద్ధరణ జరిగింది. తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి విశేష కృషి చేసిన, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును ప్రభుత్వం పునరుద్ధరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలపై మరో వడ్డన

పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు
రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జనంపై కొత్త భారం వేసేందుకు సిద్ధమైంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ఫీజును పెంచుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అన్ని పాలనాపరమైన ఉత్తర్వులను ఆయా శాఖల అధికారులకు అందించింది. భూములు, స్థలాలు, ఇళ్ల క్రయ, విక్రయాలపై రిజిస్ట్రేషన్ల భారం పడనుంది. కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు కొనుగోలుదారులు చెల్లించాల్సి ఉంది. నూతన పాలసీ ప్రకారం భూముల విలువ 10 నుంచి 15 శాతం పెరగనుంది.

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, రాజాం, శృంగవరపుకోట వంటి పట్టణాలతోపాటు ఎయిర్‌పోర్టు పుణ్యమా! అని భోగాపురం పరిసర ప్రాంతాల్లో భారీగా భూముల ధరలు పెరిగాయి. వీటి పరిధిలో రియల్‌ఎస్టేట్ రూపంలో అమ్మకాలు కూడా జోరుగానే సాగుతుంటాయి. కానీ, గతేడాది సార్వత్రికల ఎన్నికల అనంతరం జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో కూడా భూముల క్రయవిక్రయాలు తగ్గాయి. ఇలాంటి తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా భూముల ధరలను మరింత పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఒకేసారి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు అమల్లోకి రానుంది. గత ప్రభుత్వ విధానంలో మాదిరిగా భూముల రిజిస్ట్రేషన్లలో అసమానతలు లేకుండా చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. నిర్ణయం ఏదైనా జనంపై మాత్రం భారం తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు భవన నిర్మాణాల విలువను కూడా పెంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచనున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని దాదాపు అన్ని భూములపై 10 నుంచి 15శాతం ఛార్జీలు అదనంగా పెరగనున్నాయి.

15 శాతం పెంపుదల ఇలా

ప్రస్తుతం ఎకరా ధర రూ.20 లక్షలు ఉంటే, ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం అంటే.. రూ.1.50 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.3 లక్షలు చొప్పున పెరిగి, దాని విలువ రూ.23 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,72,500 పడుతుంది. అంటే అదనంగా రూ.22,500 వరకు కట్టాల్సి ఉంది. ప్లాట్లు, ఇళ్ల కొనుగోళ్లపైనా ఇదే తరహాలో భారం పడనుంది.

క్రయవిక్రయాలపై ప్రభావం

జిల్లాలో ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో కొందరు వారి ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు పొలాలు, స్థలాలను అమ్మకాలు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు తరచూ పెరుగుతుండటంతో ఆ ప్రభావం భూముల క్రయవిక్రయాలపై పడుతోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంతో అమ్మకాలు బాగా తగ్గిపోతాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుతో మరింత పతనం అవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంతో కుప్పకూలి పోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుతున్నారు.

లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

రేపటి నుంచి మహిళా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళా పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జనవరి 3, 4, 6 తేదీల్లో పిఎంటి, పిఇటి పరీక్షల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. గురువారం నిర్వహించిన 3వ రోజు దేహ దారుఢ్య పరీక్షలకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 341 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారన్నారు. ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి పి.సౌమ్యలతో స్వయంగా పర్యవేక్షించారు. మహిళా అభ్యర్థులకు ఈనెల 3, 4, 6వ తేదీల్లో మూడు రోజులపాటు పోలీసు పరేడ్ గ్రౌండులో పిఎంటి, పిఇటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

5న వాలీబాల్ బాలుర జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : జిల్లా వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లా సీనియర్ బాలుర వాలీబాల్ జట్టు ఎంపిక ఈనెల 5న స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తామని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిబాబు, కెవిఎన్ రాజు(చిన్నారి) ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడాకారులంతా ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు తప్పక హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో మన రాష్ట్రంలో జరిగే వివిధ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

ప్రచార కరపత్రం ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు తమ్మినేని, టివి రమణ, లక్ష్మి, శంకరరావు

దేశ సమగ్రత, మత సామరస్యంపై
నేటి నుంచి ప్రచారం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశ సమగ్రత, మత సామరస్యంపై సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నుండి వారం రోజులు పాటు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ దేశ సమగ్రతను, మత సామరస్యాన్ని, లౌకిక తత్వాన్ని పెంపొదిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతసామరస్యానికి, లౌకిక తత్వానికి పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. బిజెపి దాని అనుబంధ సంఘాలు అన్ని రాష్ట్రాల్లోనూ మతం పేరుతో అన్నదమ్ముల్లా కలిసి ఉండే ప్రజలను విడగొట్టి మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నా యని ఆరోపించారు. ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ప్రతి జిల్లాలో ఈ మతోన్మాదం పెరుగుతుందని, దీనికి కూటమిలో భాగమైన టిడిపి, జనసేన పార్టీలు ఊతమిస్తున్నాయని విమర్శించారు. మతమనేది వ్యక్తిగతమని, ఎవరికి నచ్చిన మతాన్ని వారు ఆచరించడంలో తప్పులేదని అన్నారు. కానీ నేడు పాలకులు మతాన్ని జోడించి రాజకీయాలు చేస్తున్నారన్నారు. మతానికి అతీతమైన పాలన ప్రజలకు అందించి దేశ సమగ్రతను, మత సామరస్యాన్ని, లౌకిక తత్వాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం ఆధ్వర్యాన వారం రోజులపాటు దేశ సమగ్రత, మతసామరస్యంపై ప్రసార కార్యక్రమం నిర్వహిస్తుందని. ప్రజలందరూ దీనికి సహకరించాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి, టివి రమణ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారుల తీరుపై
స్టాండింగ్ కమిటీ సభ్యుల ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంజినీరింగ్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్నప్పుడు ముగ్గురు డిఇలకు ఒక్కరే ఉండటం, ఎఇలు కూడా సమావేశానికి రాకపోవడంతో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ వి వి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలు అవుతున్నా ఇంకా పని తీరులో మార్పు రాలేదన్నారు. పని తీరు తీర్చుకోవడం ఇష్టం లేకపోతే ఇక్కడ నుంచి వెళ్లిపోవచ్చునని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎజెండాలోని 20 అంశాలను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధే ధ్యేయంగా సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కషి చేస్తున్నామని అన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు, అధికారుల సమన్వయంతో నగర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రహదారుల పాక్షిక మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని డివిజన్లకు 20 లక్షల రూపాయలు చొప్పున అభివృద్ధి పనుల నిమిత్తం కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య,సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణరావు, రేగాన రూపా దేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగితే సహించం : కమిషనర్

నగర పరిశుభ్రతకు ప్రజా సహకారం కూడా అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పలు అంశాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృ షి చేసారు. పెద్ద చెరువు అవుట్ ఫ్లో నీటి ప్రవాహం వద్ద చెత్తాచెదారాలు నిండి ఉండడాన్ని గమనించారు. తక్షణమే వాటిని తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని తెలిపారు. జమ్ము ప్రధానరహదారిని ఆక్రమించికూరగాయలు విక్రయించడంతో మందలించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ పరిసరాలను పరిశీలించారు. నగరంలోని 20వ డివిజన్‌లోని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజుతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బలిజవీధి ప్రాంతంలో ఉన్న ప్రధాన రహదారి మరమ్మతులకు గురైందని దానిని తక్షణమే పునర్నిర్మించాలని స్థానికులు కోరారు.

సౌర విద్యుత్ ప్రోత్సాహకానికి కీలక నిర్ణయాలు

- శతశాతం వినియోగించే ఆదర్శ గ్రామానికి రూ.కోటి నజరానా
- 51వేల ఎస్‌సి, ఎస్‌టి గృహాలకు ఫిబ్రవరి నెలాఖరుకు సౌరవిద్యుత్ కనెక్షన్లు
- దరఖాస్తు చేసిన వారికి సత్వరమే కనెక్షన్ ఏర్పాటు
- జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పిఎం సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత గృహాల్లో రాయితీపై సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటును పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. ఈ పథకం కింద వచ్చే ఫిబ్రవరిలోగా జిల్లాలోని 51వేల ఎస్‌సి, ఎస్‌టి గృహాల్లో సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసే దిశగా డిఆర్‌డిఎ, మెప్మా, మున్సిపల్, విద్యుత్ పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆయా వర్గాలకు చెందిన కుటుంబాల్లో సౌరవిద్యుత్ వినియోగంవల్ల కలిగే ప్రయోజనాలు, వారికి ఆదా అయ్యే విద్యుత్ ఛార్జీల మొత్తం తెలియజేసి యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలన్నారు. జిల్లాస్థాయి పి.ఎం.సూర్యఘర్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సౌరవిద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.20వేలు విద్యుత్ ఛార్జీల బిల్లును ఆదా చేసుకోవచ్చన్నారు. రెండు కిలోవాట్ల సామర్థ్యం గల యూనిట్ ఏర్పాటుపై పి.ఎం.సూర్యఘర్ పథకం ద్వారా రూ.60 వేల రాయితీ లభిస్తుందన్నారు. ఆదర్శ సౌరవిద్యుత్ గ్రామాలుగా జిల్లాలో ఆరు గ్రామాలను ఎంపిక చేశామని, ఈ గ్రామాల్లో శతశాతం గృహాలకు సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. శతశాతం గృహాలతో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు గల గ్రామాలుగా ఎంపికైన గ్రామానికి 1 కోటి రూపాయలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా మంజూరు చేస్తుందన్నారు. విజయనగరం రూరల్ పరిధిలో జొన్నవలస, పూసపాటిరేగ పరిధిలో రెల్లివలస, కొత్తవలస పరిధిలో దేశపాత్రునిపాలెం, రాజాం మండలంలో బొద్దాం, గజపతినగరంలో పురిటిపెంట, బొబ్బిలిలో పిరిడి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశామని తెలిపారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్లలో పెద్ద ఎత్తున రూఫ్ టాప్ సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించాలని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ లక్ష్మణరావు, బొబ్బిలి, రాజాం మునిసిపల్ కమిషనర్‌లు, డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్. నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం(మహిళా ప్రాంగణం) ఆధ్వర్యంలో గృహిణులు, యువతులకు వివిధ వత్తి శిక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో అందించే ఈ శిక్షణ కోర్సును బట్టి 30 నుంచి 60 రోజుల కాలవ్యవధి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత వుండి ఆసక్తి కలిగిన మహిళలు, యువతులు జనవరి 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్, మగ్గం వర్కు, బేకరి ఉత్పత్తులు తయారీ శిక్షణ కోర్సులకు 8వ తరగతి చదివిన వారు అర్హులని వెల్లడించారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణకు 10వ తరగతి చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సుల శిక్షణ పొందగోరే మహిళల వయసు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వుండాలని తెలిపారు.

విద్యార్థుల్లో సాంకేతిక సామర్థ్యాలను గుర్తించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులలో దాగివున్న సాంకేతిక సామర్థ్యాలను గుర్తించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆర్. హైమేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంస్కృత ఉన్నత పాఠశాలలో కస్తూరిబాయి బాలిక పాఠశాలల ఉపాధ్యాయినులకు పర్సనలైజ్డ్ ఆడప్టివ్ లెర్నింగ్ అనే అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా హైమేశ్వరరావు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంకేతిక అంశాలను నేర్చుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా ప్రయోగశాలల నిర్వహణ, ట్యాబ్‌ల వినియోగం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల నైపుణ్యాలను, ప్రగతిని గుర్తించి వారిని ప్రోత్సాహించాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో 10, ఇంటర్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేదుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఉప విద్యాశాఖ అధికారి కె.వి.రమణ, జిల్లా నోడల్ ఆఫీసర్ విశ్వేశ్వర రావు, సమగ్ర శిక్ష ఎపిఒ వి.గోపీచంద్, ఎఎస్ఒలు ఎస్.సూర్యారావు, సిహెచ్. జగన్మోహన్, పి.నాగరాజు, 26కెజిబివిల నుంచి 104మంది ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కల్వర్టు బాగు చేయాలని గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - వేపాడ

రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

మండలంలోని బల్లంకి పంచాయతీ ఎన్‌కెఆర్‌పురం పరిధిలో రైవాడ జలాశయం ప్రాజెక్టు నుంచి విశాఖ ప్రజల తాగునీటి కోసం నిర్మించిన కాలువ కల్వర్టు బాగు చేయకపోతే ఉద్యమం చేస్తామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బానాది ఎంపిటిసి గొంప తులసీ హెచ్చరించారు. గురువారం ఉదయం కల్వర్టు బీటలు వారి కుంగిపోయే పరిస్థితి రావడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే బడి బస్సులు, ట్రాక్టర్లు, లారీల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులంతా బీటలు వారిన కల్వర్టు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు బీటలు వారిన కల్వర్టును వెంటనే బాగు చేయాలని, స్పందించకపోతే విశాఖ జివిఎంసి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బల్లంకి ఉప సర్పంచ్ ధనుంజయ, బల్లంకి, బానాది, ఎం.సింగవరం యువకులు, ప్రయాణికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఐఎపిటిలో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఎపిటి) పరీక్షలో విజయనగరం-1 బ్రాంచి శ్రీ చైతన్య విద్యార్థినులు సత్తాచాటారు. హోమి బాబా సైన్స్ అండ్ రీసెర్చ్ వారు, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ పరీక్షలో రెండవ లెవెల్ కు శ్రీ చైతన్య విద్యార్థినులు పి.నిత్య శ్రీ , ఎ. శ్రీ వర్షిణి ఎంపికయ్యారు. వీరిని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు గురువారం అభినందించారు. ఈ పరీక్షకు రాష్ట్రం లో కేవలం 19 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో విజయనగరం విద్యార్థినులు అర్హత సాధించటం మన ప్రాంతానికే గర్వ కారణం అని కొనియాడారు. కార్యక్రమంలో రీజనల్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీధర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ విక్రమ్, కోఆర్డినేటర్ వెంకట రమణ గారు, డీన్లు సూర్య చంద్ర, సత్యనారాయణ, చిన్నం నాయుడు, గిరి పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

విజయనగరం కోట : గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని తెలుగు భాషా సేవా సంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు, నారాయణ స్కూల్ కరస్పాండెంట్ ఎం.నారాయణ రావు అన్నారు గురువారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు ఉపాధ్యాయులు విద్యార్థులు ఘన నివాళులర్పించారు

టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఎమ్మెల్యే అదితితో కలిసి పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఎపి టిడ్కో కాలనీల్లో వీలైనంత త్వరగా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. విజయనగరం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి ఆయన గురువారం టిడ్కో కాలనీలను పరిశీలించారు. ముందుగా సోనియా నగర్ టిడ్కో కాలనీని కలెక్టర్ సందర్శించారు. విద్యుత్ సదుపాయం, రోడ్లు, త్రాగునీటి వసతుల గురించి టిడ్కో, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. తక్షణమే వీధిలైట్లు వేయాలని, ఇళ్లచుట్టూ ప్రహరీగోడ నిర్మించి, ఆర్చ్‌ను నిర్మించాలని ఆదేశించారు. కాలనీలో దొంగతనాల నివారణకు పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఇంటికీ కుళాయి కనెక్షన్ వేయాలని, నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరుకు లబ్దిదారులతో సమావేశాన్ని నిర్వహించాలని, ఫిబ్రవరి మొదటికల్లా లబ్దిదారులంతా ఇళ్లలో నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సారిపల్లి టిడ్కో కాలనీలోని ఇళ్లను కలెక్టర్, ఎంఎల్ఎ పరిశీలించారు. ఇక్కడ 2880 ఇళ్లను నిర్మించారు. ఈ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ.19కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, దానిలో ఇప్పటివరకు రూ.11 కోట్లు వరకు ఖర్చు చేసి పనులను పూర్తి చేశామని, అప్రోచ్ రోడ్డు, సిసి రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణం కొంత పెండింగ్‌లో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత ఆరునెలలుగా పనులు ఆపివేసినందుకు కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో అప్రోచ్ రోడ్డును, సుమారు 1.8 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. తక్షణమే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. లబ్దిదారులతో సమావేశం నిర్వహించి పిఎం సూర్యఘర్ పథకం క్రింద ఇళ్లకు సోలార్ విద్యుత్ కనక్షన్ పెట్టుకొనేవిధంగా చైతన్య పరచాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ అదితిగజపతిరాజు మీడియా తో మాట్లాడుతూ, టిడ్కో కాలనీల్లో వీలైనంత తర్వగా కనీస సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు సమీపం లో నిర్మించిన సబ్ స్టేషన్‌ను శుక్రవారమే ప్రారంభిస్తామని చెప్పారు. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు ఇళ్లలోకి రాకుండా వేచి చూస్తున్నారని, సదుపాయాలను కల్పించిన వెంటనే వారందరినీ ఇళ్లలోకి రప్పిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో లబ్దిదారుల జాబితాలను కూడా మార్చేశారని, జాబితాలను తనిఖీ చేసి, వారికి న్యాయం జరిపేందుకు కషి చేస్తామని చెప్పారు. పేర్లను తొలగించిన లబ్దిదారులు అప్పట్లో తమకు ప్రభుత్వం అందజేసిన మంజూరు పత్రాలను తీసుకొని తమను సంప్రదించాలని అదితి కోరారు. పర్యటనలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, మెప్మా పీడీ సత్తిరాజు, టిడ్కో ఇఇ డివి రమణమూర్తి, విజయనగరం, నెల్లిమర్ల తాహశీల్దార్లు కూర్మనాధరావు, సుదర్సన్, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, ఇతర అధికారులు, టిడిపి నాయకులు ఐవిపి రాజు, పి.రాజేష్‌బాబు, వేచలపు శ్రీనివాసరావు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, గంటా పోలినాయుడు, బొద్దల నర్సింగరావు, అవనాపు విజయ్, కర్రోతు నర్సింగరావు, అనురాధ, బిజెపి నాయకులు ఇమంది సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ జీవనరాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు.విశాఖ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా డిఎంహెచ్ఒగా బదిలీ అయిన ఎస్.భాస్కరరావు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యంలో ఆమెకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మైనార్టీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్సు కార్పొరేషన్ ద్వారా సొసైటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్ ప్రైస్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో జిల్లా లో గల మైనారిటీ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్య నిర్వాహన సంచాలకులు ఆర్ఎస్ జాన్ తెలిపారు. ఇందుకోసం యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వారికి ఇష్టమైన కోర్సులో, పరిశ్రమలలో ఉపాధి కోసం అవసరమైన శిక్షణ ఇస్తారని తెలిపారు. మూడు నెలల శిక్షణ కాలంలో వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హతలు, వయసు, ఆధార్, వారి చిరునామా, పోస్టల్ అడ్రాస్, ఫోన్ నెంబరు వివరాలతో బయోడేటాను జిల్లా మైనార్టీస్ ఫైనాన్సు కార్పొరేషన్ కార్యాలయం, విజయనగరంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబరులో 08922-230250 సంప్రదించాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి - రామభద్రపురం

వచ్చే మార్చిలో జరగబోయే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ బృందం గురువారం ప్రచారం చేసింది. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఆ సంఘం జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాల నుంచి వచ్చి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. విద్యారంగంలో ఉపాధ్యాయ, విద్యార్థి సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా నిలిచే వ్యక్తిత్వం ఉన్న విజయ గౌరిని తప్పక గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవరావు, మండల అధ్యక్షులు సుధాకరరావు, మండల నాయకులు శ్రీరాములు నాయుడు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

హుధా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవత్వంతో పేదలకు అండగా ఉండాలని కోరారు. హుధా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జెసి రాజు, హుధా సభ్యులు రఫీ, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా మండలంలోని బిళ్లపలస గ్రామంలోని ఎన్‌సిసి కాని వాసులకు చీపురుపల్లికి చెందిన టిడిపి నాయకులు, సుజుకి షోరూమ్ అధినేత కొత్తింటి సత్యనారాయణ బెడ్ షీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో అందరు సంతోషంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాలనీకి చెందిన యువత, పెద్దలు పాల్గొన్నారు.

వల్లంపూడి పోలీసుస్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ని డిఎస్‌పి ఎం శ్రీనివాసరావు గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. సచివాలయ మహిళా పోలీసులని చట్టాలపై అవగాహన కోసం పలు ప్రశ్నలు వేశారు. క్వారీ లారీలు అధిక లోడుతో వెళ్లడం వల్ల పిక్కలు రోడ్డుపై పడిపోయి ప్రమాదాలకు కారణమవుతుందని దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. దేవరపల్లి నుంచి కెజిపూడి మీదగా గంజాయి రవాణాపై నిఘా పెంచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎల్ల అప్పలనాయుడు, ఎస్ఐ బి.దేవి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- వంగర

డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్ఐ

వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని వంగర ఎస్ఐ. షేక్ శంకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు వినియోగం లేనివారికి ఫైన్ తప్పదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వాహనాల నడిపేవారు లైసెన్స్ తప్పనిసరి అని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రేస్‌గా డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామతీర్థం హుండీ ఆదాయం రూ.18.32లక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం ధర్మ హుండీలు ద్వారా రూ.18.32లక్షలు వచ్చినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం దేవస్థానం ఆవరణలో సహాయ కమిషనర్ జి.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిపించగా గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహనాధికారి కె.పద్మావతి పర్యవేక్షణ చేశారు. ఈ లెక్కింపులో సేవా సిబ్బంది, పైడిమాంబ సేవా సంఘం, నెల్లిమర్ల పోలీస్ సిబ్బంది, రామతీర్థం జివిబి బ్యాంక్ సిబ్బంది, దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

మహారాష్ట్ర జలగంలో ఈనెల 5 నుంచి 9 వరకు జరగనున్న అండర్-17 సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు బెల్లాన సుప్రియ, భువనేశ్వరి, పాండిచ్చేరిలో ఈనెల 9 నుంచి 13 వరకు జరగనున్న సౌత్ జోన్ పోటీలకు అల్లాడు తేజస్విని, చైతన్య కుమారి, దుర్గా, యమున, మౌనిక ఎంపికయ్యారు. వీరంతా పోటీలలో పాల్గొనేందుకు గురువారం పయణమయ్యారు. క్రీడాకారులను సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బేబీనాయన, సభ్యులు సుంకర సాయిరమేష్, విజయ్, పీడీలు వెంకటనాయుడు, సత్యనారాయణ అభినందించారు.

అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-బొబ్బిలి



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలో గురువారం పన్నులు వసూళ్ల డ్రైవ్ నిర్వహించారు. షాపులకు వెళ్లి సకాలంలో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులు చెల్లించాలని కోరారు. పన్నులు సకాలంలో చెల్లిస్తే ఎటువంటి వడ్డీలు పడవన్నారు. హరిప్రియ బట్టలు షాపు నుంచి రూ.37వేలు పన్ను వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి- విజయనగరం కోట

పట్టణంలోని విటి అగ్రహారానికి చెందిన శ్రీపతి అన్నపూర్ణ(30) కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. గత నెల 28న తన ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చనిపోయారు. మృతురాలికి భర్త, పాప ఉన్నట్లు రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు.

యథేచ్ఛగా ప్రధాన రోడ్డు ఆక్రమణ

● రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు ● ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు ● అధికారుల వ్యవహార శైలిపై ప్రజలు అసహనం

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణంలో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఏ వైపు చూసినా రోడ్డునకు ఇరువైపులా ఆక్రమణలే. స్థానిక అంజనేయపురం నుంచి జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సుమారు రెండున్నర కిలో మీటర్ల మేర రోడ్డునకు ఇరువైపులా వ్యాపారస్తులతో పాటు గృహ సముదాయాలు ఉన్న వారు యథేచ్ఛగా రోడ్డుని ఆక్రమించుకున్నారు. ఇంకొంత మంది వ్యాపారస్తులైతే ఏకంగా తమ షాపుల ముందున్న మెయిన్ రోడ్డు స్థలాలను సైతం తోపుడు బళ్ల వారికి అద్దెలకు ఇస్తున్నారు. ఒక పక్క ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి, మరోపక్క కాలువలను ఆక్రమించుకోవడంతో వాటిగుండా పోవాల్సిన నీరు వెళ్లక ఎక్కడికక్కడ మురుగు పేరుకు పోవడంతో ప్రజలు రోగాలు బారిన పడడం పట్టణంలో సహజంగా మారిపోయింది. ఇంత జరుగుతున్నా అటు ఆర్ అండ్ బి అధికారులు గానీ ఇటు పంచాయతీ అధికారులు గానీ మరో పక్క పోలీసులు గానీ పట్టించుకోవడం లేదంటూ స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ రోడ్డు ఆక్రమణకు గురికావడంతో ఇరుగ్గా తయారై ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడి గతంలో చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందారు. అంజనేయపురం నుంచి జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు సుమారు రెండున్నర కిలోమీటర్లున్న మెయిన్ రోడ్డు సుమారు 115 అడుగుల వెడల్పు ఉండాల్సి ఉన్నప్పటికి రెండు వైపులా ఆక్రమించుకోవడం వల్ల కేవలం 60 నుంచి 75 అడుగులకు తగ్గిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా ప్రధాన కాలువలు నిర్మాణం జరిగినప్పటికీ కాలువల పైన సిమెంట్ కప్పులు వేసి మరి రోడ్డును ఆక్రమించుకొని పలువురు వ్యాపారస్తులు యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. కాలువల పైన పలకలు వేయడంతో పాటు రహదారిని కూడా ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారస్తులు తమ వ్యాపార సౌలభ్యం కోసం రోడ్డును ఆక్రమించుకొని షాపులలో ఉంచవలసిన సామాగ్రిని రోడ్డుపైనే ఉంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. పలకలతో రోడ్డుని ఆక్రమించడంతో షాపులకు వచ్చే కొనుగోలుదారులు సైతం తన వాహనాలను రోడ్డుపైనే ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా అంజనేయపురం జంక్షన్ నుండి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డు పక్కన గల ప్రధాన కాలువలు కనిపించకుండా సిమెంట్ పలకలతో కప్పేసి దుకాణాలను నిర్వహించి రోడ్డును ఆమించు కోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కాలువలపై ఇష్టానుసారంగా పలకలు ఏర్పాటు చేసేయడం వల్ల బయటకు పోవలసిన మురికి నీరు సక్రమ మార్గంలో వెళ్లకపోవడంతో పట్టణ పరిధిలో ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఒక్కో చోట కాలువలు మురుగుతో నిండిపోయి రోడ్లపైకి వచ్చేడంతో అంటూ రోగాలతో పాటు వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కాలువలు ఆక్రమణతో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తా చెదారం

పట్టణ ప్రధాన రహదారిలోని కాలువల్లో పేరుకుపోయిన మురుగు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డుపైకి వచ్చేయడంతో అందులో దోమలు వృద్ధి చెంది జ్వరాలు విజృంభనకు కారమైయ్యాయని పలువురు చెబుతున్నారు. కాలువలపై పలకలు ఏర్పాటు చేయడంతో కాలువల్లో ఉన్న మురుగును తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి, పోలీస్ శాఖ, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆక్రమణకు గురైన రహదారితో పాటు పేరుకుపోతున్న మురుగు కూపాలు తొలగించడానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి - గజపతినగరం

ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను శనివారం వేలం వేస్తామని ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉత్తర్వులు మేరకు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో గజపతినగరం ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో 2021 మోడల్ రెండు ప్లెజర్ వాహనాలు 52 వేల రూపాయలు గాను, 2014 మోడల్‌కు చెందిన ఒక మాస్ట్రో వాహనాన్ని పదివేల ఐదు వందల రూపాయలు మొదటి ధరలుగా నిర్ణయించా మన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేలం ప్రక్రియలో పాల్గొనవచ్చునని అన్నారు.

కార్మిక సంఘ నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు శ్రామిక సంఘం మాజీ నాయకులు పతివాడ అప్పారావును వర్కర్స్ యూనియన్ నాయకులు, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. అప్పారావు వెన్ను నొప్పితో బాధ పడుతూ శస్త్ర చికిత్స చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను తన స్వగ్రామం కొండగుంపాంలో వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు, సిపిఐ నాయకులు మొయిద పాపారావు, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మ నాభం పరామర్శించారు. అప్పారావు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జ్యూట్ యాజమాన్యం అక్రమ లాక్‌అవుట్‌పై చర్చించి భవిష్యత్తులో కార్మికుల తరపున పోరాడాలని కోరారు.

మారిక రోడ్డు సమస్యను పరిష్కరించాల్సిందే

ప్రజాశక్తి- వేపాడ

మారిక గ్రామ రోడ్డు సమస్య పరిష్కరించాల్సిందేనని అంతవరకూ ఎంపిడిఒ కార్యాలయాన్ని విడిచి పెట్టేది లేదని గిరిజనులు తెగేసి చెప్పారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయం ఎదుట మారిక గిరిజనులు నిరసన తెలిపారు. అధికారులు దిగొచ్చే వరకూ నిరసన తెలుపుతామని హెచ్చరిస్తూ అక్కడే వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. సిపిఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ పలుమార్లు రోడ్డు సౌకర్యం కల్పించాలని రిలే నిరాహార దీక్షలు, వంటావార్పు కార్యక్రమాలు చేసినప్పటికీ అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. పోరాటంతోనే సమస్యను పరిష్కరించుకో వచ్చునని మరోసారి నిరసనకు దిగామన్నారు. గిరిజనల రోడ్డు పనులు ప్రారంభించే వరకు ఎంపిడిఒ కార్యాలయాన్ని విడిచి పెట్టేది లేదని చెప్పారు. అవసరమైతే నిరాహార దీక్ష కూడా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గిరిజనులంటే పాలకులకు చిన్న చూపు అని ఎన్నికల ముందు ప్రతి నాయకుడు అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదన్నారు. ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తహశీల్దార్ జె.రాములమ్మ, ప్రాజెక్ట్ డిఇ ఐశ్వర్య గిరిజనులతో మాట్లాడుతూ మీ సమస్య పరిష్కారానికి అధికారులతో సంప్రదిస్తామని నిరసన కార్యక్రమం ఆపాలని కోరారు. తమ సమస్యను మాటల్లో కాదని చేతల్లో చూపించాలని అంతవరకూ ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదని చెప్పారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాతపోయిన పెంటమ్మ, జి బాబురావు, జి అప్పలనాయుడు, కె కృష్ణ, పెంటమ్మ, జి అప్పలనాయుడు, జాలరి వీర్రాజు, బాల సోమేశ్వరరావు, రామకృష్ణ, అప్పారావు, లింగరాజు, గిరిజన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

గిరిజనులకు తప్పని రహదారి ఇక్కట్లు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రేషన్ సరుకులు పట్టుకుని కొండెక్కుతున్న గిరిజనులు

మండలంలోని రేగపుణ్యగిరి గిరిజనులకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రేషన్ సరుకులు భుజాలపై మోసుకొస్తూ కొండలపైకి ఎక్కి నడిచి వెళ్లే దృశ్యాలు ప్రజాశక్తికి కంటపడ్డాయి. వీరంతా ఎస్.కోట నుంచి సుమారు 5 కిలోమీటర్ల కొండపైకి ప్రయాణించడానికి రోడ్డు లేక వాహనాలు వెళ్ళకపోవడంతో, కాలినడకన రేషన్ సరుకులు భుజాలపై మోసుకొని కొండ ఎక్కుతున్నారు. ఎవరికైనా రోగాలు వచ్చినపుడు కూడా గిరిజనులు డోలీ కట్టి రోగులను మోసుకుంటూ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అనేక సందర్భాల్లో మార్గమధ్యంలో చనిపోతున్నారని వాపోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకంలో రోడ్డు మంజూరు చేయాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని జనసేన నాయకులు సన్యాసినాయుడు తెలిపారు.

ఆదాయం పెంపులో వ్యవసాయమే కీలకం

● సాగు విరామం లేకుండా చూడాలి ● ప్రాథమిక రంగంపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ లో భాగంగా ప్రాథమిక రంగం లో జిల్లా తలసరి ఆదాయాన్ని 15 శాతం పెంచడానికి లక్ష్యంగా పెట్టామని, ప్రస్తుతం 35 వేలు ఉన్న తలసరి ఆదాయాన్ని 65 వేలకు పెంచాలనే లక్ష్యం తో పని చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అందుకోసం ఒక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, ఉద్యాన, పట్టు , మత్స్య, పశు సంవర్ధక, మైక్రో ఇరిగేషన్ తదితర శాఖలు వారి రంగంలో ఏ విధంగా పురోగతి సాధించవచ్చునో 15 రోజుల్లోగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక రంగం పై కలెక్టరేట్ ఆడిటోరియం లో గురువారం జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎంత భూమి ఉంది, అందులో ఎంత భూమి వ్యవసాయ యోగ్యంగా ఉంది, ఏయే పంటలకు అనుకూలంగా ఉంది, వర్షాధారం ఎంత , జలవనరుల ద్వారా ఎంత సాగవుతోంది తదితర వివరాలను వర్గీకరించి మండల వారీగా సమర్పించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ సాగుకు అవకాశం ఉన్న భూమి సాగు లేకుండా ఖాళీగా ఉండకూడదని అన్నారు. ఖరీఫ్ అనంతరం మరల ఖరీఫ్ పంట వచ్చే లోపల భూమి పై ఏదో ఒక పంట ఉండాలని స్పష్టం చేసారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు వేయాలన్నారు. వరి లేని చోట ఉద్యాన, ఇతర పంటలకు ఉన్న అవకాశాలను గుర్తించాలన్నారు. రైతుకు ఆదాయం వచ్చే అవకాశాలను చూడాలన్నారు.

జిల్లాలో ప్రస్తుతం సుమారు 40 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతోందని, దీనిని రెట్టింపు చేసే అవకాశాలు ఉన్నాయ, రైతులను ప్రోత్సహించేలా ప్రణాళికలు ఉండాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. మత్స్యశాఖ వారి ఉత్పత్తులను పెంచడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా లైవ్ స్టాక్, గుడ్లు ఉత్పత్తి పై దష్టి పెట్టాలని, మొత్తంగా ప్రాథమిక రంగాన్ని రెట్టింపు చేసే ప్రణాళికలు ఉండాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ వరి పంట తో పాటు సమాంతరంగా ఇతర పంటలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

మరమ్మతులు పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని శాఖ గ్రంథాలయ భవనం మరమ్మతు పనులను ఎమ్మెల్యే బేబినాయన గురువారం పరిశీలించారు. గ్రంథాలయ భవనం పాడైపోవడంతో నూతన భవనం నిర్మించాలని ఏడాది క్రితం జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి రిలే నిరాహార దీక్షలు చేయడంతో అప్పటిలో మున్సిపల్ నిధులు రూ.5లక్షలు కేటాయించి భవన మరమ్మతు పనులు చేపట్టారు. ఆ పనులను బేబినాయన పరిశీలించి వారంలో పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, బాత్ రూమ్ నిర్మించాలని కమిషనర్ రామలక్ష్మిను ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి స్వర్ణకుమారి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటం

ప్రజాశక్తి- బొబ్బిలి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తు ప్రజలకు అండగా నిలబడుతున్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. గురువారం బొబ్బిలి పట్టణంలో సిపిఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను వివిధ షాపులకు అంటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కార్మికులకు కర్షకులకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిన ఘనత సిపిఐకు ఉందన్నరు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ నాయకులు పొడుగు అశోక్, పాలూరి కృష్ణ, వై శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎం పరిశీలన

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పిట్టాడ పంచాయతీ మధుర వానిజ గ్రామంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ భానుమూర్తి, సర్పంచ్ కాపారపు పైడిపునాయుడు గురువారం పరిశీలించారు. ఐటిడిఎ పరిధిలో వన సంరక్షణ సమితి ఎన్నికల సందర్భంగా పాల్గొని విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఎంపిడిఒ, సర్పంచ్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గిరిజనులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌గా ఫ్లోరెన్స్

ప్రజాశక్తి- వేపాడ

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇంచార్జి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌గా వెళ్లిన టిఎం ఫ్లోరెన్స్ మళ్లీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. సుమారు 5 నెలలు పాటు విజయనగరం ఇంచార్జి డిసిఒగా పనిచేసిన ఆమె స్థానంలో విశాఖపట్నం డిసిఒగా పనిచేస్తున్న రూపావతి ఇక్కడకు రావడంతో ఈమె తిరిగి ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో బాధ్యతులు స్వీకరించారు.

రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల: సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ సుదర్శనరావు

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ పి. సుదర్శనరావు అన్నారు. మండలంలోని పూతికపేట, తమ్మాపురం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఇందులో భాగంగా ముందు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ దివ్య, విఆర్ఒ సౌజన్య, పంచాయతీ కార్యదర్శి అనూష, తమ్మాపురం సర్పంచ్ పి. భాస్కర రావు, పూతిక పేట మాజీ సర్పంచ్ యడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: గతంలో జరిగిన రీసర్వేలో భూ సమస్యలను 45రోజులలో పరిష్కరిస్తామని ఎడి కె.రమణమూర్తి తెలిపారు. గురువారం మండలంలోని కొర్లాంలో తహశీల్దార్ అజు రఫీజన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు నుండి దరఖాస్తులను స్వీకరించి సమస్యలను తెలుసుకొని వాటి పరిస్కార మార్గాలను సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అధికారులు రైతులు పాల్గొన్నారు.

పోలీసుల విజయానికి ప్రజలే కారణం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎస్ఐను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

పోలీసుల విజయానికి కారణం అక్కడ ప్రజలేనని డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన ఎస్ఐ సన్యాసినాయుడు, రైటర్ అప్పారావు, వాసు, అప్పలరాజు, రఘు, నాయుడులకు బుధవారం స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ అధ్యక్షతన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మండలంలోని 6 నెలలు పాటు పనిచేశానని తక్కువ సమయంలో మంచిగా పనిచేయడానికి కారణం ఈ ప్రాంత ప్రజలు, నాయకులు అని అన్నారు. సిఐ రామకృష్ణ మాట్లాడుతూ ఈ మండలంలోని జాతీయ రహదారి, తీరం, పరిశ్రమలతో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ప్రజలు, నాయకులు నుంచి ఎటువంటి ఇబ్బందులూ లేనందునే ఇక్కడ పోలీసులు సక్సెస్ అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నింటి సన్యాసినాయుడు, మహంతి శివ, బాలా అప్పలరాజు, పిన్నింటి యల్లంనాయుడు, పిన్నింటి కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే ధ్యేయం

ప్రజాశక్తి- కొత్తవలస

టిబి నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వరల్డ్ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియ దర్శిని అన్నారు. వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని నిమ్మళపాలెంలో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కె.నిర్మలసాయి అధ్యక్షతన వైద్య సిబ్బంది 85 మందికి ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇఒ నరసింహారావు, పంచాయతీ సెక్రటరీ వెంకటలక్ష్మి, స్కూల్ హెచ్.ఎమ్.పార్వతి, హెల్త్ అసిస్టెంట్, సత్యారావు ఎమ్ఎల్‌హెచ్‌పి. పావని, ఎఎన్.ఎమ్. లక్ష్మి, సచివాలయం సిబ్బంది, ఆశ వర్కర్స్ ఈశ్వరమ్మ, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న హెల్త్ కన్సల్టెంట్ ప్రియదర్శిని

నెల్లిమర్ల: స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం క్షయపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో, జాతీయ టిబి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి కె.సత్యం మాట్లాడుతూ క్షయ వ్యాధిపట్ల విద్యార్థులందరు పూర్తిగా అవగాహన తెచ్చుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ప్రభోదకులు డాక్టర్ సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి వ్యాధి లక్షణాలు వ్యాప్తి, నివారణ, మొదలైన అంశాలను క్లుప్తంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పిఒలు ఎన్ అప్పారావు, ఎల్ సంధ్యా, అధ్యాపకులు డివిడి ప్రసాద్, రెడ్ క్రాస్ కార్యకర్తలు డి గౌరీ, పి సుధాకర్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

రామభద్రపురం: జాతీయ క్షయవ్యాధి నిర్మూలనా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సులను వినియోగించు కొని క్షయ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని తహశీల్దార్ సులోచనారాణి కోరారు. గురువారం దుప్పలపూడి, నరసాపురం గ్రామాల్లో టిబి సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకుంటే నివారణ సాధ్యపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మలత, ఆశా కార్యకర్త ఉయ్యాల బంగారమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

గుగ్గిలపు కిషోర్ కుమార్ ప్లాటు కు సంబంధించి రిజిస్ట్రేషన్ నెం.4613/2021 మరియు 4614/2021 (ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు) గల రెండు డాక్యుమెంట్లు విజయనగరం పట్టణంలోని కొత్తపేట సమీపంలో (టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి) పోయినవి. డాక్యుమెంట్లు దొరికినచో కింది నంబరునకు సంప్రదించగలరు. ఫోన్ నెం.9949060798

CHANGE OF NAME

I, Under signed K.CHINNAMMADU (Old Name) W/o Kandiborra Appala Naidu, Akkivaram Village & Post, Denkada Mandal, Vizianagaram District 535216, A.P. Changing my Name from KANDIBORRA CHINNAMMADU (New Name) shall hence forth I am being called as **KANDIBORRA CHINNAMMADU** W/o Kandiborra Appala Naidu for all purposes.